విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

భగత్‌నగర్, జూలై 3: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడ్డం నాగర్జున కోరారు. బుధవారం పీడీఎస్‌యూ జిల్లాఉపాధ్యుడు గడ్డం శ్రీకాంత్ ఏఐఎఫ్‌డిఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

చిచ్చు రేపిన జడ్పీ చివరి సమావేశం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌పై కేసు నమోదు
- సీఈవో శ్రీనివాస్‌పై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లా ప్రజాపరిషత్ చివరి సర్వసభ్య సమావేశం రాజకీయ చిచ్చు రగిల్చింది. అధికారుల విధి నిర్వహణను అడ్డుకున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అధికారులు ఫిర్యాదు చేయంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారులే శాసనసభ్యుడి హక్కులకు భంగం కలిగించారని బీఆర్ఎస్ నేతలు సీఈవోపై పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం రాజకీయంగా వేడి పుట్టిస్తోంది. మంగవారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన హుజురాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి తాను నియోజకవర్గంలో జరిపిన విద్యాశాఖ సమీక్షా సమావేశానికి హాజరైన ఎంఈవోలు,



పోలీస్ హెడ్ క్వార్టర్స్ బయట మీడియాతో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హెచ్ఎంలకు డీఈవో మెమో జారీ చేయడాన్ని ఆక్షేపిస్తూ, డీఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయడం ఈ వివాదానికి తెరతీసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ డీఈవో జనార్దన్‌రావును సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. ఆయన కాంగ్రెస్ జడ్పీటీసీ గీకురు రవీందర్ అడ్డుపడడంతో వారిద్దరి మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం వ్యక్తిగతంగా దూషించుకునే వరకు వచ్చింది. సమావేశం రసాభాసగా మారుతున్న సందర్భంలో కలెక్టర్ పమేలా సత్పతి బయటకు వెళ్లేందుకు వేదిక దిగగా ఆమెను బయటకు వెళ్లకుండా ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు బైఠాయించి అడ్డుకున్నారు. ఈ సంఘటనపై జడ్పీ సీఈవో శ్రీనివాస్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఎమ్మెల్యేగా తన బాధ్యతనునిర్వహిస్తుండడాన్ని అడ్డుకుని, తన హక్కులకు భంగం కలిగించింది అధికారులేనంటూ కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఇతర బీఆర్ఎస్ నాయకులు కూడా పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, నిరుపేద దళితులకు రెండో విడుత దళితబంధుల నిధుల విడుదల, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అసౌకర్యాల గురించి నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడటానికి ప్రయత్నిస్తే తనను అడ్డుకొని కించపరిచారని, ఎమ్మెల్యేగా తన హక్కులను కాలరాసి వ్యక్తిగత ప్రతిష్టను కూడా దెబ్బతీశారని, దీనికి బాధ్యులైన జడ్పీ సీఈవో శ్రీనివాస్‌పై చట్టపరంగా చర్య తీసుకోవాలని కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీ రామారావు స్పందిస్తూ అధికారపార్టీ నేతల అవినీతిని బయటపెడుతున్న క్రమంలోనే ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయించి బెదిరిస్తున్నారని వాఖ్యానించారు. దీంతో ఈ వ్యవహారం కాస్త కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదంగా రూపుదాల్చుతోంది. జిల్లా పరిషత్‌లో జరిగిన ఈ సంఘటన రాజకీయరంగు పులుముకుంటుండడంతో అధికారులు ఇరకాటంలో పడుతున్నారు.

● శాసన సభ్యుడిపై కేసు పెట్టడం దురదృష్టకరమని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎవరిపై కేసులు పెట్టలేదని, అందరిని సమానంగా చూడాలన్నారు. ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలగకుండా విచారణ చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపులు ఉండవన్నారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గుర్తు చేశారు. ప్రజా సమస్యలు మాట్లాడితే గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్లోజ్ చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడితే ఎఫ్ఐఆర్‌లు చేస్తారా ? అసెంబ్లీలో తాము మాట్లాడితే తమ పై ఎఫ్ఐఆర్‌లు చేస్తారా.. అని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్లా హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, గడ్డం ప్రశాంత్‌రెడ్డి, కుల్దీప్, షౌకత్, నేతి రవివర్మ పాల్గొన్నారు.

స్పీకర్ వద్ద ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేస్తా..

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ క్రైం: జడ్పీ సీఈవో, డీఈవోపై అసెంబ్లీ స్పీకర్ వద్దకు వెళ్లి ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేస్తామని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్‌లు మీడియాతో మాట్లాడారు. గతంలో మాదిరిగా విద్య శాఖపై జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించడం లేదని, అందుకే హుజూరాబాద్‌లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించానని, ఇందులో తప్పేముందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆ సమావేశానికి హాజరైన ఏంఈవోలకు నోటీసులివ్వాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. అధికారులు తమ వైఖరితో సమాధానం చెప్పలేని పరిస్థితి తెచ్చుకుంటున్నారని విమర్శించారు. తన గళాన్ని ఎలా తుంగలో తొక్కుతారన్నారు. జవాబు చెప్పకుండా కలెక్టర్ వెళ్లి పోతుంటే న్యాయం చేయాలనీ తాను కోరానని, అందులో తప్పేముందన్నారు. అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ మాటల్లోపడి ఆగం కాకండని అన్నారు. ఆయన మాటలు నమ్మిన వాళ్ళు జైలుకు వెళ్లారన్నారు. జడ్పీటీసీ రవీందర్ బీఆర్ఎస్ బీ ఫామ్‌తో గెలిచి పార్టీ మారాడన్నారు. కేసీఆర్ ఇచ్చిన బి ఫామ్‌తో గెలిచిన వాళ్లు రాజీనామా చేసి వెళ్లాలన్నారు.

జడ్పీ, మండలాల్లో ప్రత్యేక అధికారులు



- ముగిసిన పాలకవర్గాల పదవీకాలం
- ఎన్నికలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- గ్రామపంచాయతీల్లో ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మండల, జిల్లా ప్రజా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. స్థానిక సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానున్నది. గ్రామపంచాయతీల్లో సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం ఫిబ్రవరి 1న ముగియడంతో 2 నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారులే పాలన వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల, జిల్లా పరిషత్ అధ్యక్షుల పదవీ కాలం ముగియడంతో ఇక్కడ ప్రత్యేక అధికారులే బాధ్యతలు చేపట్టనున్నారు. స్థానిక సంస్థల్లో వెంటనే ఎన్నికలు జరుగాల్సి ఉన్నా అవి ఎప్పుడు జరిగేది స్పష్టత లేకుండా పోయింది. బీసీ గణన పూర్తిచేసిన తర్వాతే వాటి ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టి ఎన్నికలు నిర్వహించే అవకాశముందని చెబుతున్నారు. బీసీ గణన పూర్తయి, దానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసే సరికి నాలుగైదు నెలలైనా పట్టవచ్చని భావిస్తున్నారు. ఈ సంవత్సరాంతానికి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు మెంబర్లు లేకపోవడంతో ఇప్పటికే పాలనా వ్యవస్థ అస్తవ్యస్త మైందని, పారిశుధ్య నిర్వహణ సరిగా జరుగడం లేదని, తాగునీటి సరఫరా సమస్యలకు దారితీస్తున్నదని ఆరోపణలు వస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ సమయంలో పంచాయతీల్లో పాలన మరింత కష్టంగా మారే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

మండలానికో జిల్లా స్థాయి అధికారి

ఒక్కో మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ ప్రత్యేకాధికారులను నియమించగానే గురువారం నుంచి వారు బాధ్యతలను చేపట్టనున్నారు. గ్రామపంచాయతీలు, మండల, జిల్లా ప్రజాపరిషత్‌లో నిధుల లేమి కారణంగా పల్లెల్లో అభివృద్ధి నిలిచిపోయింది. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారింది. స్థానిక సంస్థలకు ఐదేళ్లగా 15వ ఆర్థిక సంఘం నిధులు మినహా సీసీరేజీ నిధులతోపాటు ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు చేయలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు సగమే రావడంతో ప్రజాప్రతినిధులే చాలా మంది సొంత డబ్బులు వెచ్చించి ప్రజలకు అత్యవసరమైన సేవలందించారు. జిల్లా స్థాయి అధికారిని ఒక్కో మండలానికి ప్రత్యేకాధికారిగా నియమించడంతో వారు సమావేశాలకు పరిమితమయ్యే అవకాశాలుంటాయని, సమస్యలను పరిష్కరిస్తారో లేదోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేయాల్సిన అవసరముంది. గత ప్రభుత్వం జిల్లాలోని 313 గ్రామపంచాయతీలకు ఒక్కో పంచాయతీకి ఒక ట్రాక్టర్, ట్యాంకర్‌ను 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసి ఇవ్వగా ఇప్పటికే వాటి నిర్వహణ ఖర్చులకు నిధులు కేటాయించక పోవడంతో సగానికిపైగా గ్రామాల్లో ట్రాక్టర్లను మూలనపడేశారు. కొన్ని గ్రామాల్లో మంచినీటి సరఫరాకు వినియోగిస్తుండగా, కొన్నిచోట్ల వనమహోత్సవంలో భాగంగా మొక్కల పెంపకంలో నాటిని మొక్కలకు నీటి కోసం వినియోగిస్తున్నారు. ఇప్పటికే పల్లెల్లో అనేక సమస్యలు నెలకొన్నందున ప్రత్యేక పాలనలో ప్రత్యేంగా నిధులు కేటాయిస్తే తప్ప ప్రజలకు ఇబ్బందులు తప్పవనే భావన వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారులు ఏ విధంగా ముందుకు వెళ్తారో వేచి చూడాలి.

● అధికారులు అందుబాటులో ఉంటారా..?

మండల, జిల్లా పరిషత్‌లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో అధికారులే పాలనా బాధ్యతలు చేపడితే వారు ఆశించిన మేరకు అందుబాటులో ఉండే అవకాశం లేదని, సమస్యలు ఉత్పన్నమవుతాయనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతున్నది. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజాప్రతినిధులు అధికారంలో ఉన్నపుడే స్థానిక పాలన అస్తవ్యస్తంగా ఉందంటూ ప్రజలు ఆందోళనలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం అధికారుల హయాంలో పాలన మరింత క్లిష్టంగా మారే ప్రమాదముందని, వెంటనే ఎన్నికలు జరిగితే బాగుండేది అనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతున్నది. జిల్లాలోని 15 మండలాల్లో 313 గ్రామపంచాయతీలుండగా 178 మంది ఎంపీటీసీలు, 15 మంది మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, 15 మంది కో అప్షన్ సభ్యులు, 15 మంది జడ్పీటీసీలు, ఇద్దరు కో అప్షన్ సభ్యుల పదవీకాలం బుధవారం ముగిసింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జూలై 3: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవిలో లేకున్నా ప్రజాసేవ చేయాలన్నారు. మండలంలో ఆరు నెలల్లో మార్పు తీసుకవచ్చామని తెలిపారు. రవాణా శాఖ మంత్రిగా చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించానన్నారు. ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, వెన్నేపల్లి, వెన్నంపల్లి సింగిల్ విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, ఏవో వైదేహి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుధాకర్, గుండారపు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మ్యాకల రవిందర్, సింగిల్‌విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

చిగురుమామిడి: ఎన్నికలు జరిగినంత వరకే పార్టీలు, రాజకీయాలని, ఎన్నికల అనంతరం అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు భాగస్వాములు కావాలని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ కాలం పూర్తి చేసిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దంపతులు కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ, ఎంపీటీసీలను మంత్రి సన్మానించినారు. అంతకు ముందు మండల పరిషత్ ఎదుట ఏర్పాటు చేసిన జాతీయ చిహ్నాలను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో మధుసూదన్, జడ్పీటీసీ రవీందర్, వైస్ ఎంపీపీ బేతి రాజిరెడి పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వండి..

మండలంలోని ఇందుర్తి-గాగిరెడ్డిపల్లి రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇందుర్తి ఎంపీటీసీ అందె స్వప్న మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సంబంధిత అధికా రులను సంప్రదిస్తే వారు అంబాటులోకి రాలేదు. సంబం ధిత అదికారులకు వెంటనే షోకాజ్ నోటీస్‌లు జారీ చేయాలని ఆర్డీవో మహేశ్‌ను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలకు జిల్లా విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 3: రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే ఎంపిక పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థుల వివరాలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. ఇటీవల అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో వివిద అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 8న ఉదయం 10 గంటలకు కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డు, ఆదార్ కార్డు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో రిపోర్ట్ చేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని హకీంపేట్ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌లో మధ్యాహ్నం 3 గంటల్లోపు రిపోర్టు చేయాలని సూచించారు. 9న పోటీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

● ఎంపికైన విద్యార్థులు:

జి రిచా రాయల్ (రామడుగు), రెడ్డబోయిన యశస్విని (హుజురాబాద్), బి అవిక (కరీంనగర్), జి హంసిక (గన్నేరువరం), గట్టు మోక్ష (రామ డుగు), జె రుషిత (గంగాధర),ఎలగందుల కృతిక (చిగురుమామిడి), బి భువనేశ్వరి (చొప్పదండి), పి అద్విత (పెద్దపాపయ్యపల్లి), కె జాన్వి (చిగురు మామిడి), అంబాల కార్తిక్ (జమ్మికుంట), బానోత్ మనస్విని (కరీంనగర్), బి హరిచరణ్ (చొప్పదండి), ఎం శ్రావణి (చొప్పదండి), వడ్లూరి ప్రమోద్ (నేదునూరు)

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- డంపింగ్ యార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయండి
- మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, జూలై 3: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్ర మత్తంగా ఉంటూ పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లను ఆదేశించారు. బుధవారం ఆయన డంపింగ్ యార్డును సందర్శించి ఇంజనీరింగ్ అధికారులు, బయో మైనింగ్ ఏజెన్సీ, స్మార్ట్‌సిటీ కన్సల్‌టెన్సీ ప్రతినిధులకు పలు సూచన లతోపాటు ఆదేశాలిచ్చారు. డంపింగ్ యార్డు వరకు మట్టి రోడ్డు వేసి పారిశుధ్య వాహనాలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఇంజనీర్లను ఆదే శించారు. బయో మైనింగ్ పనులు తుది దశకు చేరుకు న్నందున వ్యర్థాలను ఎప్పటికప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించాల న్నారు. డ్రోన్ సహాయంతో డంపింగ్ యా ర్డులోని చెత్త ఎంత మొత్తంలో ఉందో లెక్కించాలని, డంపింగ్ యార్డుకు వచ్చే వాహనాలను పరిశీలించేందుకు వెంటనే సీసీ కెమెరాలను అమర్చాలని ఆదేశించారు. అనంతరం కలెక్ట రేట్ సమావేశమందిరంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో పారిశుధ్య పనుల నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను వినియోగించే హోటల్స్, రెస్టారెంట్లు, మార్కెట్లు, ఫంక్షన్ హాల్స్, కర్రీ పాయింట్లను గుర్తించాలని, వాటిని వినియోగించే వారికి జరిమానా విధించాలని సూచిం చారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డయేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబల కుండా అవసరమైన ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్లు డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనుల తీరును పరిశీలించాలని, చెత్తాచెదారాన్ని మురుగునీటి కాలువల్లో నుంచి వెంటవెంటనే తీసివే యాలని సూచించారు. చెత్త సేకరణలో పిల్లలను విని యోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, విధుల్లో నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్పిటల్స్, క్లినిక్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లు, సీహెచ్‌సీలను తనిఖీ చేస్తూ బయో మెడికల్ వ్యర్థాలను ఇష్టానుసారంగా వేస్తే జరిమానా విధించాల న్నారు. ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్సు ఉండేలా చూడాలని, రెన్యూవల్ ఫీజులను వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి, సెక్రెటరీ వెంకన్న, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ స్వామి, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందుండాలి

కరీంనగర్ రూరల్, జూలై3: ప్రజా ప్రతినిధులు అధికారం ఉన్నా- లేకు న్నా ప్రజాసేవలో ముందుంటే ప్రజలు ఆదరిస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నా రు. బుధవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మం డల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, ఎంపీటీసీలను గంగుల కమలాకర్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన మళ్లీ మీకే అవకాశం ఉంటుందన్నారు. పదవీ కాలం ముగిసినా ప్రజల వెంటే ఉండి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పురమల్ల లలిత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వేల్పుల నారాయణ, కరీంనగర్ సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీడీవో సంజీవరావు, ఏపీవో జగన్మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ రమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

● కొత్తపల్లిలో..

భగత్‌నగర్: కొత్త మండలం, చిన్న మండలం అయినా కొత్తపల్లిని అభివృద్ధిలో ఉరుకలు పెట్టించామని మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో బుధవారం ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ కాలం ముగిసినా ప్రజల మధ్య ఉండి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్టల కరుణ రవీందర్, ఎంపీడీవో ప్రభు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సాబీర్‌పాషా, వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, ఎంపీటీసీలు దావ కమల మనోహర్, మంద రమేష్‌గౌడ్, పండుగ గంగవ్వ నర్సయ్య, కొమ్ము హేమలత, రవికిరణ్, పట్టం శారద లక్ష్మీనారాయణ, కో-అప్షన్ సభ్యుడు షరీఫ్, స్పెషల్ ఆఫీసర్ రాంబాబు, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో స్పందన, ఏఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

● ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కులు రాక


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,762 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.125 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 4.980 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనం అమలుకు ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, జూలై 3 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులకు బ్రేక్ దర్శనం వెసులుబాటును కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో బ్రేక్ దర్శనం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు చేస్తున్న ప్రయత్నం ఎట్టకేలకు ఫలించనుంది. బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని దానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర దేవదాయశాఖ కార్యాలయానికి పంపించినట్లు రాజన్న ఆలయాధికారులు తెలిపారు. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే బ్రేక్ దర్శనం ఏర్పాటు చేసున్నారు.

రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు బ్రేక్ దర్శనం చేసుకునేందుకు వీలుగా ఒక్కొక్కరికి రూ. 300 టికెట్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 10.15 గంటల నుంచి 11.15 వరకు గంటపాటు బ్రేక్ దర్శనం, సాయంత్రం 4 గంటల సమయం నుంచి 5 గంటల వరకు గంటపాటు బ్రేక్ దర్శనం వెసులుబాటు అందుబాటులోకి తీసువస్తున్నట్లు తెలిసింది. రాజన్న ఆలయంలోని ఉత్తర ద్వారం ద్వారా బయటకు వెళ్లే దారి నుంచి గంటపాటు బ్రేక్ దర్శనం లైన్‌ను, లేక ప్రత్యేకమైన పై ఓవర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

కరీంనగర్ బస్టాండ్‌లో చోరీకి యత్నం

● పట్టుకున్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 3: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక పాత నేరస్థుడు ఒక వ్యక్తి జేబులో నుంచి పర్సు దొంగలించే యత్నం చేస్తుండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. ఐదు సంవత్సరాల కిందట బస్టాండ్‌లో దొంగతనానికి పాల్పడిన కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన చిలుక రాజు మళ్లీ బుధవారం బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి జేబులో చేతులు పెట్టి దొంగతనానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు నిందితుడిని మూడో టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఏటీఎం కృష్ణ, ఐసిఎస్ రావు, ఏఎస్ఐ లక్ష్మి, కానిస్టేబుల్ బివి రమణ, విజిలెన్స్ సెక్యూరిటీ ప్రదీప్, మానస, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక మృతి

చందుర్తి, జూలై 3: కుటుంబ కలహాలతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతున్న బాలిక బుధవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం బండపల్లికి చెందిన కుమ్మరి శ్రీవాణి(15)అనే బాలిక ఈ నెల 1న కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీవాణి మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


సత్తక్కపల్లిలో ఊరేగింపుగా బోనాలతో భక్తులు

మెట్‌పల్లి రూరల్, జూలై3: మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం భక్తులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఇంటికోక బోనాన్ని భక్తిశ్రద్ధలతో తయారు చేశారు. తయారు చేసిన బోనం భక్తులు నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలతో ఊరిగేంపుగా ఆలయానికి బయలుదేరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, అధిక దిగుబడులతో రైతులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర

మానకొండూర్ : మండలంలోని కొండపల్కల గ్రామంలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఎల్లమ్మ పట్నాలు, జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరలో గౌడ కులస్థులతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరలో సంఘం నాయకులు మల్యాల మొగిలి, నల్లగొండ రాములు, దూలం సంపత్, బోంగోని కనుకయ్య, మాజీ సర్పంచు కొరిమి పితాంబర్, మల్యాల రాములు, కొరిమి విష్ణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేంపేటలో హరితహారం చెట్లు నరికివేత


వేంపేట శివారులో నరికి వేసిన చెట్లు

మెట్‌పల్లి రూరల్, జూలై, 3 : మండలంలోని వేంపేట గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం నీరుగారిపోతోంది. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి. వేంపేట గ్రామ శివారులో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పూర్తిగా విద్యుత్ లైన్ కిందనే అధికంగా ఉన్నాయి. ఈ మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు అంటుకొనే ప్రమాదం ఉందని సుమారు 100కు పైగా చెట్లను నరికివేశారు. ఈ విషయంపై కార్యదర్శిని అడగగా రోడ్డు పక్కన ఉన్న రైతులు నరికి వేసి ఉంటారని పలువురు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం హరితహారంలో చెట్లను నాటండి అని చెబుతుంటే కొందరు అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయంపై ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణను ఫోన్ ద్వారా వివరణ కోరగా విషయం తెలయదు, తమ దృష్టికి బుధవారం వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 నుంచి పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూలై3: ఎస్‌యూ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 10నుంచి 16వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై3: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle. cgg. gov.in వెబ్‌సైట్‌లో శుక్రవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 8,9,15,16,22,23,30,31తేదీల్లో ఉదయం 10గంటల నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 0878-68686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

గణేశ్‌నగర్, జూలై 3: పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.జ్ఞానప్రకాష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కోర్సులో ప్రవేశానికి టీఎస్-పాలీసెట్ 2024 పరీక్షలో ఉత్తీర్ణులైన ఎంబైపీసీ ర్యాంక్ విద్యార్థులు అర్హులు. ఈ యూనివర్సిటీ పరిధిలో నాలుగు పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలలు, మహబూబ్‌నగర్, మామునూర్ (హనుమకొండ జిల్లా), సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలో మొత్తం 110 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్, ప్రైవేటు రంగంలో డెయిరీ, పౌల్ట్రీఫార్మ్, పెట్ హాస్పిటల్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నట్లు తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.tsvu.edu.inలో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 20లోపు దరఖాస్తు చేయవచ్చని తెలియజేశారు.

కుక్కల దాడిలో వృద్ధ దంపతులకు గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై3: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రామ్ కనుకమ్మ, రామ్ బోషయ్య వృద్ధ దంపతులు కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నారు. బుధవారం ఇంట్లో పడుకొని ఉన్న వృద్ధ దంపతులపై వీధి కుక్కలు దాడి చేశాయి. కనుకమ్మకు కుక్కల దాడిలో కాలుకు గాయాలయ్యాయి. గ్రామస్థులు 108కి సమాచారం అందించడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'


ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

- టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైయిజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్క్రీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

పిడుగుపాటు కాదు..అంతర్గత లోపమే

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ జరిగి పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలకు నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

- మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..
- ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి


అనిత (ఫైల్)


రమ్య (ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) చదువుకుంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మి, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగుల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లులుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్లపాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

కూలిన 'నిర్లక్ష్యం'

- ● కుప్పకూలుతున్న మానేరు వంతెన గర్డర్లు
- ● ఈ ఏడాది ఏప్రిల్‌లో మూడు.. తాజాగా ఐదు..
- ● తొమ్మిదేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు


మంగళవారం రాత్రి కూలిన గడ్డర్లు


గతంలో కూలిన గర్డర్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు(ఫైల్)

ముత్తారం, జూలై 3: ఏళ్ల తరబడి సాగుతున్న పనులు.. నాణ్యతా లోపం.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. వెరసి నిర్మాణ దశలో ఉన్న వంతెన గర్డర్లు కుప్పకూలాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై సుమారు తొమ్మిదేండ్ల క్రితం ఈ వంతెన పనులు మొదలుపెట్టారు. నాటి నుంచి నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని రెండు జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాగా మంగళవారం రాత్రి కురిసిన ఈదురుగాలుల వర్షానికి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు పెద్ద శబ్దంతో కిందపడ్డాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులు మొదలుకాగా, పనుల్లో అలసత్వం, ఆలస్యం తాజా ఘటనకు కారణంగా కనిపిస్తున్నది. గాలి దుమారమే ఘటనకు కారణమని చెబుతున్నా, వారి నిర్లక్ష్యమే కారణం స్థానిక ప్రజానీకం మండిపడుతున్నది.

● మూడు నెలలైనా కాకముందే..

ఓడెడు వంతెనలోని 10-11 పిల్లర్ల మధ్యలో ఉన్న మూడు గర్డర్లు ఈదురుగాలులకు ఈ ఏడాది ఏప్రిల్ 22న రాత్రి ఇదే విధంగా నేల మట్టం అయ్యాయి. రెండేళ్లుగా వాగు ఉప్పొంగి ప్రవహించడంతో, గర్డర్లకు సపోర్టుగా పెట్టిన చెక్కలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగానే గర్డర్లు నేలకూలాయి. ఈ సంఘటన జరిగి మూడు నెలలైనా గడవకముందే మంగళవారం రాత్రి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు నేలకూలాయి. ఏప్రిల్‌లోనే అధికారులు అప్రమత్తమై ఉంటే తాజా ఘటన జరిగి ఉండేది కాదని ప్రజలు మండిపడుతున్నారు. కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

● గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం

రెండు జిల్లాల మధ్య దూరాన్ని తగ్గించేందుకు 2016లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.49కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది. గత ప్రభుత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి కూడా ఈ వంతెన పనుల్లో ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. వానాకాలంలో తరచూ వరదలు రావడం.. సామగ్రి దెబ్బతినడం ప్రధాన సమస్యగా మారింది. దీంతో పాటు కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో జాప్యం నెలకొంది. మధ్యలో మరో రూ.11కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పనులు ఆలస్యమవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వంతెన దెబ్బతిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వంతెనను త్వరగా పూర్తిచేయాలని తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. పనులు మళ్లీ వేగంగా మొదలవుతాయని ఆశించిన స్థానిక ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇటీవల వంతెనను సందర్శించిన అధికారులు పనుల్లో నాణ్యతా లోపం ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. కాగా, కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు వేయాలని, అదేవిధంగా పనులు మధ్యలో నిలిపేసిన గత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యమానేరు వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో రెండు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మట్టి రోడ్డు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

మృత్యువుతో పోరాడుతున్న మహిళ

- ఒంటరిగా మిగిలిన మూడేళ్ల కుమారుడు
- వైద్యం కోసం ఎదురు చూస్తున్న కుటుంబం

గంగాధర, జూలై3: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ మహిళ మృత్యువుతో పోరాడుతోంది. గంగాధర మండల కేంద్రానికి చెందిన విశ్వనాథం శ్రీనివాస్ కుమార్తె హరిణి(26) నెల రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లగా వివిధ పరీక్షలు నిర్వహించి మెదడు వాపునకు కారణమయ్యే తీవ్రమైన ఎన్‌సెఫలైటిస్ వ్యాధిగా వైద్యులు నిర్ధారించారు. ఇరవై రోజులుగా హరిణి పరిస్థితి రోజురోజుకూ దిగజారి ప్రాణా పాయ స్థితికి చేరింది. ఆపరేషన్ చేస్తే కానీ మెరుగుపడదని తక్షణం రూ.30లక్షలు సమకూర్చుకోవాలని వైద్యులు సూచించారు. ఇప్పటికే అప్పులు చేసి 20 లక్షల పైచిలుకు ఖర్చు చేసి వైద్యం చేయించామని తండ్రి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో మృత్యువుతో పోరాడుతున్న హరిణిని కాపాడాలని తండ్రి శ్రీనివాస్ వేడుకుంటున్నాడు. ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నాడు. మృత్యువుతో పోరాడుతున్న తన తల్లి విషయం తెలియని మూడేళ్ల కుమారుడు ఒంటరిగా మిగిలాడు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 3 : మండలంలోని గూడూరు గ్రామంలో మైనర్‌ను కిడ్నాప్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన బత్తిని ప్రశాంత్ మైనర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి కిడ్నాప్ చేశాడని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం కిడ్నాప్ చేసిన ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

షార్జాలో కొత్తపేటవాసి ఆత్మహత్య


శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై3: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తునికి శేఖర్(27) షార్జాలో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శేఖర్ నెల రోజుల క్రితం బల్దియా కంపెనీలో పనినిమిత్తం వెళ్లాడు. జూన్ 22న శేఖర్ అక్కడే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామస్థులకు సమాచారం అందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

కారు ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

మల్యాల, జూలై 3: కొండగట్టు కొండపైన గల బొజ్జపోతన ఆలయం వద్ద ఓ కారు ఢీకొట్టిన సంఘటనలో మూడు విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయ్యాయి. ముగ్గురు వ్యక్తులు గత సోమవారం తెల్లవారు జామున టీజీ22జీ4149కారులో వస్తూ నిర్లక్ష్యంగా వాహనం నడుపడంతో రహదారి పక్కన గల స్తంభాలు విరిగిపోయాయని ట్రాన్స్‌కో రామన్నపేట సెక్షన్ ఏఈఈ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 3: బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న రాజస్థాన్ హోటల్ యజమానిపై ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లో ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అశోక్‌నగర్ ప్రాంతంలో దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా రాజస్థాన్ జై రామ్ దేవ్ బాబా హోటల్లో 14 సంవత్సరాలలోపు బాలుడు పనిచేస్తుండగా రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచారు. అధికారుల ఆదేశాల మేరకు బాలుడిని షెల్టర్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. అనంతరం మూడో ఠాణాలో హోటల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ చక్రధర్‌రెడ్డి, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ఆపరేషన్ ముస్కాన్ ఇంచార్జి ఎస్ఐ అన్వర్, టీం సభ్యులు సాగర్, కవిత పాల్గొన్నారు.

ఖనిలో చోరీ

కోల్‌సిటీ, జూలై 3: గోదావరిఖని జీఎం కాలనీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగలు తులం బంగారం, 70తులాల వెండి ఎత్తుకెళ్లినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. జీఎం కాలనీలో నివాసముండే ఎడ్ల పద్మ అనే గృహిణి పది రోజుల క్రితం ఊరికి వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో బీరులో ఉన్న తులం బంగారం, 70తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కరీంనగర్ జైలు నుంచి ఆరుగురు ఖైదీల విడుదల

కరీంనగర్ క్రైం, జూలై 2: వివిధ కేసుల్లో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆరుగురు ఖైదీలు బుధవారం విడుదల అయ్యారు. శిక్ష సమయంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి రాష్ట్ర వ్యాప్తంగా 213 మంది ఖైదీలను విడుదల చేసింది. కరీంనగర్ జిల్లా నుంచి ఏడుగురు ఖైదీల విడుదలకు ప్రతిపాదనలు వెళ్లగా ఆరుగురు ఖైదీలు విడుదలయ్యారు. హత్య కేసుల్లో జీవితఖైదు శిక్ష పడిన ఆరుగురు ఖైదీలను మంగళవారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి హైదరాబాద్ చర్లపల్లి జైలుకు తరలించారు. వీరందరికీ అక్కడ కౌన్సెలింగ్ నిర్వహించిన జైలు ఉన్నతాధికారులు, వారికి ఉపాధి చూపించి విడుదల చేశారు. ఇందులో ముగ్గురికి కరీంనగర్ జైలు పెట్రోల్ బంక్‌లో ఉపాధి కల్పించారు. కరీంనగర్ జిల్లా జైలు నుంచి 2010 నుంచి ఖైదీలుగా ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన మెచ్చే మధు, ముచ్చె ఆశయ్య, ముచ్చె గంగయ్యలతో పాటు ఎస్‌కే ముస్తాక్, సయ్యద్ జుబేర్, పవార్ రాజులు విడుదలయ్యారు. వీరు ఆరుగురు జైలు నుంచి విడుదల అయిన తరువాత శాంతియుతంగా, సత్ప్రవర్తనతో ఉంటానని 50 వేల రూపాయల స్వంత పూచీ కత్తు బాండ్‌పై విడుదల అయ్యారు. గతంలో వీరికి విధించిన శిక్షాకాలం పూర్తి అయ్యేవరకు వారి గ్రామం పరిధిలోని పోలీసు ఠాణాలో ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. ఏదైనా నేరాలలో పాల్గొంటే రద్దు చేసిన శిక్షను మళ్లీ యదావిధిగా విధిస్తారు.

అట్రాసిటీ కేసుల్లో పరిహారం సకాలంలో అందించాలి

● ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి ● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్


మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం బాధితులకు సకాలంలో అందించాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవ చేయాలని, ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాలకు వచ్చిన ఆయన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం, రుణాలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, పరిశ్రమలు, ఎస్సీ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వివరాల ప్రగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క అధికారి క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అర్హులను మాత్రమే ఎంపిక చేసి లబ్ధి చేకూరేలా చూడాలని, ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కట్టుదిట్టంగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమా ర్ బాబు, రిసర్చ్ అధికారి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రావాల్సిన హక్కులను అందించాలి

రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎస్సీలకు రావాల్సిన హక్కులు వారికి అందుతున్నాయా లేదా పరిశీలించి సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ ల్యాండ్ పట్టాలు అందించే అవకాశంపై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశాలలో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్‌పై రివ్యూ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సకాలంలో పరిష్కరించాలని, వీటిపై పార్లమెంట్ 2018లో 18 ఏ సెక్షన్ కింద ఎస్సీలు అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్థులను అరెస్టు చేయాల్సి ఉంటుందన్నారు. అన్యాయం జరిగిన నిమ్న వర్గాల ప్రజలకు అండగా ఎస్సీ కమిషన్ ఉంటుందన్నారు. సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమార్‌బాబు, రీసర్చ్ అధికారి వరప్రసాద్‌లు పాల్గొన్నారు. జగిత్యాలకు వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాంచందర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆకట్టుకున్న అల్ఫోర్స్ రెయిన్‌బో ఉత్సవాలు


ఉత్సవాల్లో విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూలై 3: నగరంలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్‌లో ఏర్పాటు చేసిన అల్ఫోర్స్ రెయిన్‌బో ఉత్సవాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్య ప్రణాళికలో భాగంగా బుధవారం సప్తవర్ణంలో విద్యార్థులకు రెయిన్‌బో గురించి బోధించామన్నారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, జూలై3: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఒకటో టౌన్ సీఐ సరిలాల్‌కు ఫిర్యాదు చేశారు. రాహుల్‌గాంధీ ముఖంపై షూ సింబల్ పెట్టి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి ఆయన ప్రతిష్టను దిగజార్చేలా చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దిగుడు సుబ్బారావు అనే వ్యక్తి సోషల్ మీడియాలో ఈ పోస్ట్ చేశాడని, ఇతరులు షేర్ చేశారని తెలిపారు. వీరందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, ధన్నాసింగ్, గంగుల దిలీప్, మమ్మద్ సలీం, మహమ్మద్ ఇమ్రాన్, సత్తయ్య, అబూ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులను వాడొద్దు

కరీంనగర్ టౌన్, జూలై 3: ప్లాస్టిక్ సంచులను స్వచ్ఛందంగా మానుకొని వాటికి బదులుగా బట్ట సంచులు, ఇతర పర్యావరణ హితమైన సంచులను వాడాలని పర్యావరణవేత్త తోట లక్ష్మణ్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల నివారణ దినాన్ని పురస్కరించుకొని స్థానిక సర్వోదయ సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ సంచులు పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నాయని, వాటిని సంపూర్ణంగా మానుకుందామని అన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ హితమైన సంచులను గాంధీ విగ్రహం వద్ద ప్రదర్శించారు. సంస్థల అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించగా అసోసియేట్ అధ్యక్షుడు గంజి స్వరాజ్‌బాబు, ప్రధాన కార్యదర్శి సామ నారాయణ, కోశాధికారి కొమురవెల్లి వెంకటేశం, ఉపాధ్యక్షులు పాత వెంకటనర్సయ్య, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్‌సిటీలో అవినీతిపై విచారణ జరిపించాలి'

కరీంనగర్ టౌన్, జూలై 3: కరీంనగర్ స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని, వీటిపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాని మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్మార్ట్‌సిటీ నిబంధనల మేరకు నగరంలోని ఆనాటి 50 డివిజన్లలో కాకుండా కార్పొరేషన్‌కు చేరువలోని బొమ్మకల్‌లో జంక్షన్ ఏర్పాటుకు నిధులు మళ్ళించి నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపించి బాధ్యులైన మున్సిపల్ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ప్రాజెక్టు మేనేజిమెంట్ కన్సల్‌టెన్సీ ప్రతినిధి ఎండి కెఎస్‌సిసిఎల్ ఈ పనుల్లో భాగస్వాములైన వారందరినిపై చర్య తీసుకోవాలని కోరారు. రవీందర్‌సింగ్ వెంట బీఆర్ఎస్ నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ పరిధిలోకి రామేశ్వరాలయం

కరీంనగర్ కల్చరల్, జూలై 3: దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమీషన్ ఆదేశాల మేరకు నగరంలోని కమాన్‌రోడ్ రామేశ్వరాలయాన్ని జిల్లా దేవాదాయశాఖ అధికారులు శాఖ పరిధిలోకి తీసుకున్నారు. బుధవారం ఆలయంలో ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమీషనర్ ఎ.చంద్రశేఖర్ సారథ్యంలో బృందం ఆలయాన్ని సందర్శించి ఆలయ బాధ్యులకు వివరాలు వెల్లడించారు. ఈఓగా వుడుతల వెంకన్నను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, ఈఓలు కొస్న కాంతారెడ్డి, నాగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన చామనపల్లి విద్యార్థులు

కరీంనగర్ రూరల్, జూలై3: బాసర ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లింగంపల్లి శ్రావ్య కామల్ల వీణలు సీట్లు సాధించారు. మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో శ్రావ్య కామల్ల వీణలు అత్యంత ప్రతిభ కనబరిచి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ బాసిత్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్చాలి

- జిల్లా సంక్షేమాధికారి సరస్వతి

హుజూరాబాద్, జూలై 3: ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని జిల్లా సంక్షేమాధికారి సరస్వతి అన్నారు. బుధవారం హుజూరాబాద్ కేసీ క్యాంపులోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. ఆట పాటల ద్వారా ప్రత్యేక సిలబస్‌తో అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు రమాదేవి, సీహెచ్ జ్యోతి, స్వరూప పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

హుజూరాబాద్, జూలై 3: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అవకతవకలపై గురువారం ప్రతిపక్ష పార్టీలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, కార్యదర్శి అభిలాష్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, ఎన్‌టీఏ సంస్థ నిర్వహణ లోపం, పేపర్ అమ్ముకోవడంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు చాలా బాధాకరమన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూల్, కళాశాలలు స్వచ్ఛందంగా యాజమాన్యాలు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోహేల్, శివ, నాగరాజు, వంశీ, రాజేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం

హుజూరాబాద్, జూలై 3: హుజూరాబాద్ పట్టణంలో సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల తిరుగుతూ ప్రతి ఒక్కరూ బట్ట సంచులు వాడాలని అవగాహన కల్పించి, వాటిని ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో రవీందర్, రమేష్, వినోద్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

శంకరపట్నం, జూలై 3: శంకరపట్నం మండలంలోని తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో బుధవారం అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా రైతు భరోసాలో భాగంగా రైతుబంధుపై రైతుల అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. కార్యక్ర మంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి మనోజ్‌కుమార్, ఏవో రాచకొండ శ్రీని వాస్, ఏఈవోలు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సైదాపూర్: రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడతాయని వెన్కేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి మనోజ్‌కుమార్‌లు అన్నారు. బుధవారం సంఘం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి రైతు భరోసాపై సలహాలు, సూచనలు సేకరించారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ అధికారి శ్రీనివాస్, ఏఈవో నిఖిల్, ఉపాధ్యక్షుడు కలకోటి కిషన్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి: రైతు భరోసా పథకంపై రైతులు తెలిపిన అభిప్రాయాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేస్తామని సింగిల్ విండో చైర్మన్ జంగ వేంకట రమణారెడ్డి అన్నారు. రైతువేదికలో నిర్వహించిన రైతు మహాజన సభ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. జిల్లా నోడల్ అధికారి నిర్మల, మండల వ్యవసాయాధికారి కేతిరి రంజిత్‌రెడ్డి, సీఈఓ కాటం నర్సయ్య, వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

జమ్మికుంట, జూలై 3: జమ్మికుంట పట్టణానికి చెందిన పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి సోదరుడు, సీనియర్ పాత్రికేయులు పత్తి విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, పూదరి శివ, సుంకరి రమేష్, గూడేపు సారంగ పాణి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'


మాట్లాడుతున్న జడ్పీటీసీ గీకురు రవీందర్

సుభాష్‌నగర్, జూలై 3: జడ్పీ సమావేశంలో తనను పరుష పదజాలంతో దూషించిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని చిగురుమామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను మోసం చేసి బ్లాక్ మెయిల్ చేసి పాడి కౌశిక్‌రెడ్డి గెలిచారన్నారు. ఎమ్మెల్సీ పదవి కోసం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి మారిన చరిత్ర కౌశిక్‌రెడ్డిదన్నారు. 48 గంటల్లో పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, బీఆర్ఎస్ అత డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేక పోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

గణేశ్‌నగర్: జడ్పీటీసీ గీకురు రవీందర్‌పై అసభ్య పదజాలంతో మాట్లాడడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను బీసీ సంక్షేమసంఘం, అను బంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ చౌక్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జిల్లా పరిషత్ సమావేశంలో గీకురురవీందర్‌ను అసభ్య పదజాలంతో మాట్లాడటం సరికాదని వెంటనే బీసీ ప్రజాప్రతినిధులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జనాభాలో 50శాతం ఉన్న బీసీలు ఓట్లు వేస్తేనే హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలిచాడన్నారు బీసీలంతా ఏకమై ఇలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోనే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆయనను ఎమ్మెల్యే పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీసీ సంఘాల ద్వారా గవర్నర్‌ను కలిసి కోరతామన్నారు. వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని వారు అన్నారు. బయట రోడ్లు ఎక్కకుండా చేస్తామని బీసీ సంఘాల పక్షాన వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య గౌడ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి పర్శరాం గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి మాచర్ల అంజయ్య గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు జి ఎస్.ఆనంద్, రంగు సంపత్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్లు రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, ఉపాధ్యక్షులు పెంట శ్రీనివాస్, మంతెన కిరణ్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మదాసు సంజీవ్, బీసీ సంఘాల నాయకులు గొడిశేల రమేష్ గౌడ్, బొయిని ప్రశాంత్, తల్లపల్లి మహేష్. అజయ్, గోపాతి రాకేష్, జక్కుల సందీప్ తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

6న రౌండ్ టేబుల్ సమావేశం

సుభాష్‌నగర్, జూలై 3: కేంద్ర ప్రభుత్వం చట్టాలను మార్చడంపై ఈనెల 6న జిల్లా కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించ నున్నట్లు ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టాలు మార్చాలని బార్ కౌన్సిల్ గాని, లా కమిషన్ కాని ఎప్పుడు అడగలేదన్నారు. ఏలాంటి డిమాండ్ లేకుండానే చట్టాలను మార్పు చేశారన్నారు. చట్టాలను మార్పు చేయడంతో పాటు 30 సెక్షన్‌లను మార్చారన్నారు. గతంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు దానికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌ను అదే రోజు రూపొందించే వారన్నారు. కొత్త చట్టం ప్రకారంఎఫ్ఐఆర్ నమోదుకు 15 రోజుల గడవును పెంచారన్నారు. దీనితో 15 రోజుల్లో ఏమైనా జరగవచ్చన్నారు. దీనిపై లా కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. 148 ఎంపీలను సస్పెండ్ చేసి ఈబిల్లును పాస్ చేశారన్నారు. నగరంలోని ఫిలింభవన్‌లో నిర్వహించే సమావేశానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ రెండు రాష్ట్రాల లీగల్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, రిటైర్డ్ జడ్జి నారాయణ, కొండారెడ్డి పాల్గొంటా రన్నారు. ఈ సమావేశంలో బోయినపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, రవీందర్ యాదవ్, ఈశ్వర్, రామ్మూర్తి పాల్గొన్నారు.

మానేరు విద్యార్థులకు పురస్కారాలు

కరీంనగర్ టౌన్, జూలై 3: నేషనల్ సేమ్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సెమ్స్ మ్యాథ్స్ సైన్స్ ఒలింపియాడ్ 2024లో ఆల్ ఇండియా, స్టేట్ ర్యాంకులను కరీంనగర్ మానేరు విద్యార్థులు సాధించి హైదరాబాద్‌లో సినీ నటుడు ప్రదీప్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులను మానేరు విద్యార్థులు అందుకోవడం గర్వంగా ఉందని అన్నారు. మానేరు విద్యార్థులు ఆత్రేయ, వహీదున్నీసా ఆల్ ఇండియా ఫస్ట్, సెకండ్ ర్యాంకులు, అక్షయ్, కాజల్, లాస్యప్రియలు రాష్ట్రస్థాయి ఫస్ట్ ర్యాంకులను కైవసం చేసుకున్నారని, వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో సిలివేరి మహేందర్‌తో పాల్గొన్నారు.

7న శ్రీమద్భగవద్గీత పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూలై 3: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు వైరాగ్యం ప్రభాకర్ రచించిన జీవన తత్వ గీత నిత్య చైతన్య ప్రదాత శ్రీమద్భగవద్గీత పుస్తకాన్ని ఆదివారం ఉదయం 10గంటలకు భగత్‌నగర్ వివేకానంద హైస్కూల్‌లో ఆవిష్కరిస్తున్నట్లు బొమ్మకంటి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కీర్తి పురస్కా గ్రహీత, కవి, వ్యాఖ్యాత, కాలమిస్ట్ గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు హాజరౌతారని పేర్కొన్నారు.

నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలి

కరీంనగర్ జూలై3, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదికగా నిలవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఇన్నోవేటర్ తయారు కావాలని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. చదువుకు వయస్సుతో పనిలేదని, ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణుల ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతో పాటు తదితర ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి ఆసక్తి గల వారు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543 కు పంపాలని సూచించారు. వృత్తి, ఊరుపేరు, జిల్లా పేరుతో వివరాలతో ఆగస్టు 5వ తేదీలోగా పంపించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈఓ జనార్దన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, డీపీఓ రవీందర్, డీఆర్డిఓ శ్రీధర్, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రావు, ఎన్ వై కే కోఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి


సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

భగత్‌నగర్, జూలై 3: సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపి వేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనుల వేలం వేయడానికి కేంద్రం సద్ధమైందని అట్టి వేలాన్ని రద్దు చేయాలన్నారు. సింగరేణి వేలాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈసమా వేశంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీల నాయకులు మర్రి వెంకటస్వామి, మిల్కూరి వాసు దేవరెడ్డి, జూపాక శ్రీనివాస్, కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లిరాజు, గుగులోతు భీమాసాహేబ్, సుంకరి సంపత్, సిందం ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

కరీంనగర్ రూరల్, జూలై3: రైతు బరోసాపై రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసా యాధికారి బత్తిని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బత్తిని శ్రీనివాస్ ముఖ్య అతిదిగా హాజరై మాట్లాడారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. రైతు భరోసాపై రైతులు సూచించిన అభిప్రాయం మేరకు ప్రభుత్వం రైతు భరోసా అమలు చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్స్పెక్టర్ యండి జలాలుద్దీన్ అక్బర్, డైరెక్టర్‌లు గాజుల అంజయ్య, బిజిలి పోచాలు, కుంభం అంజలి, వేల్పుల రమేష్, గాండ్ల అంజయ్య, గాండ్ల లక్ష్మీనారాయణ, సీఈఓ వేణుమాధవ్, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంబంధాలను కొనసాగించాలి

ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం


హుజూరాబాద్‌లో సభ్యులతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి


తిమ్మాపూర్‌లో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఘన సన్మానం

హుజూరాబాద్‌రూరల్, జూలై 3: ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రజా సంబంధాలను కొనసాగిస్తే ఉన్నత పదవులు పొందవచ్చని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాణి, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

● తిమ్మాపూర్: ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అందరి సమన్వయం, సహకారంతోనే తిమ్మాపూర్ మండలానికి జాతీయ స్థాయిలో ఉత్తమ మండలంగా గుర్తింపుతో పాటు అవార్డు వచ్చిందని, తన హయంలో ఈ ఘనత సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందని తిమ్మాపూర్ ఎంపిపి కేతిరెడ్డి వనిత దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తిమ్మాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సభ్యులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఎంపిడివో విజయ్ కుమార్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● మానకొండూర్: అధికారుల సహకారంతో ఐదేళ్లలో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఎంపీపీ ముద్దసాని సులోచన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఎంపీడివో ఎం. నర్సయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీటీసీలతో పాటు ఎంపిడివోలకు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇంచార్జి ఎంపీడివో రాజేశ్వర్‌రావు ఉన్నారు.

● గంగాధర: గంగాధర ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీకి వీడ్కోలు, సన్మాన సమావేశం ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ పుల్కం అనురాధ మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో 4కోట్ల జడ్పీ నిధులతో మండలాన్ని అభివృద్ధి పథంలో నిలిపినట్లు తెలిపారు. ఎంపీపీ శ్రీరాం మధుకర్, వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలను, జడ్పీటీసీలను సన్మానించారు.

● వీణవంక: పదవులు ఎవరికీ శాశ్వతం కాదు ఎవరైనా మాజీలు కావాల్సిందే అని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. అనంతరం ప్రజాప్రతినిధులను సన్మానించారు.

● ఇల్లందకుంట: ప్రజాప్రతినిధులు తమ పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ప్రజాసేవలో ఉండాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ సరిగొమ్ముల పావని-వెంకటేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

● గన్నేరువరం: తన పదవీకాలం ముగిసినప్పటికీ రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో గన్నేరువరం మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఎంపిపి లింగాల మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో ఎంపీటిసిగా గెలిపించిన ఖైలారం, హన్మాజిపల్లి, సాంబయ్యపల్లి గ్రామస్థులకు, ఎంపీటీసీలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


వీణవంకలో ఎంపీపీ, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి


మానకొండూర్‌లో ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు


గంగాధరలో సన్మానం

ఏబీవీపీ నగర కార్యదర్శిగా నందు

కరీంనగర్ టౌన్, జూలై 3: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కరీంనగర్ నగర కార్యదర్శిగా బామండ్ల నందు రెండోసారి ఎన్నికయ్యారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా ప్రముఖ్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచకొండ గిరిబాబు, విభాగ్ కన్వీనర్ అజయ్, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, లా ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ నక్క ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

భగత్‌నగర్, జూలై 3: కొత్తపల్లి మండలం మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ సహకారంతో రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. 99 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిం చగా 11మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్, రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, సీనియర్ క్లబ్ మెంబర్ రాళ్లబండి శంకర్ ప్రసాద్‌రెడ్డి, స్కూల్స్ ఐక్యాంప్ కో-ఆర్డినేటర్ లయన్ గుండోజు లక్ష్మయ్య, చాడ మల్లారెడ్డి, వేల్పుల బాలకిషన్‌రావు, ఈసందర్భంగా విద్యార్థులకు రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ సభ్యులు బిస్కెట్స్ పంపిణీ చేశారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

భగత్‌నగర్, జూలై3: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కోతిరాంపూర్, కిసాన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారాయని ఆయన విమర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, అభినయ్, సాయికుమార్, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

భగత్‌నగర్, జూలై 3: సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యమని కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి అన్నారు. బుధవారం రేకుర్తిలోని సాన్వి జూనియర్, డిఫెన్స్ అకాడమిలో విద్యార్థులకు సైబర్ నేరా లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండడం ముఖ్యమని సైబర్ నేరస్తుల లక్ష్యం కూడా విద్యార్థులను యువతను ఉపయోగించుకుని నేరాలకు పాల్పడడమే అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎరవేసే తాయిలాలకు ఆశపడవద్దని సెల్‌ఫోన్లు కంప్యూటర్ల ద్వారా జరిగే నేరాలపై అవగాహన కలిగి ఉండాల న్నారు. కార్యక్రమంలో సాన్వి కళాశాల కరస్పాండెంట్ ఎర్రంశెట్టి మునీందర్, ప్రిన్సిపాల్ సిరిపురం ప్రసాద్ పాల్గొన్నారు.

నీట్ లీకేజీకి ప్రధాని బాధ్యత వహించాలి

సుభాష్‌నగర్, జూలై 3: నీట్ పేపర్‌లీకేజీకి ప్రధానమంత్రి బాధ్యత వహించాలని సీపీఐ ఎంఎల్ మాస్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు విద్యార్థిసంఘాలు, యువజన సంఘాలు నిర్వహించే బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిందం ప్రసాద్, నాయకులు లక్ష్మయ్య లంక అంజనేయులు పాల్గొన్నారు.

ఎలగందల్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం

భగత్‌నగర్, జూలై 3: కొత్తపల్లి మండలం ఎలగందల్‌లో ఓపెన్ జిమ్‌ను కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ ప్రారంభించారు. సుడా నిధులు ఐదు లక్షల రూపాయలతో మంజూరైన జిమ్‌ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పిట్టల రవీందర్, ఎంపీటీసీ మంద రమేష్‌గౌడ్, పట్టెం లక్ష్మీనారాయణ, పంజాల స్వామిగౌడ్, ఎంపీడీవో ప్రభు, తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

భగత్‌నగర్, జూలై 3: నగరంలోని సీతారాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. జిల్లా విద్యాధికారి వి జనార్ధన్‌రావు చేతుల మీదుగా 40మంది విద్యార్థులకు అందజేశారు. ఈకార్యక మంలో కార్పొరేటర్ జంగిలి సాగర్, ఉపాధ్యాయురాలు ప్రసన్న, గుంజపడుగు హరిప్రసాద్, ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు, కర్రె పావని పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాలని నిరసన

చొప్పదండి, జూలై 3: చొప్పదండి పట్టణ పరిధిలో సెంట్రల్ లైటింగ్ పనులు వెంటనే చేపట్టాలని బీజేపీ నాయకులు చొప్పదండిలో రాస్తారోకో నిర్వహించారు. తొమ్మిది నెలలుగా రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయినా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఉన్నారు.

పనులు ప్రారంభించాలి

గంగాధర, జూలై 3: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూత్ర శాలల నిర్మాణం ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎస్ఎఫ్ఐ మండలనాయకులతో కళశాలను సందర్శించారు. రితీష్, రిశికేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి నియంత్రణపై అవగాహన

వీణవంక, జూలై3:మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో ఎస్సై తోట తిరుపతి అధ్వర్యంలో గంజాయి,డ్రగ్స్ నియంత్రణపై జమ్మికుంట రూరల్ సిఐ కిషోర్ అవగాహన కల్పించారు. గంజాయి కేసుల్లో 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు యువకులు పట్టుబడుతున్నారని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు.

పునరుత్పాదక పద్ధతిపై అవగాహన

జమ్మికుంట,జూలై3:పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సుగుణ పునరుత్పాదక పద్ధతి దుక్కి దున్నకుండా వరి, మొక్కజొన్న, పత్తి పంటల సాగుపై అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన పునరుత్పాదక వ్యవసాయ రూపకర్త చంద్రశేఖర్ హరి బడిషాలే మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే విధంగా ఈ పద్ధతి రూపొందించినట్లు తెలిపారు. కెవికె ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయ్,గోపాల్‌రెడ్డి,శాస్త్ర వేత్తలు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్,రాంబాబు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గంగాధర, జూలై 3: యారన్ సబ్సిడీని విడుదల చేసినందుకు గర్శకుర్తి చేనేత కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020లో నిలిచిపోయిన యారన్ సబ్సిడీని విడుదల చేసి కార్మికులను ఆదుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మరమగ్గాల కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గర్శకుర్తి చేనేత కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక డంపులను సీజ్ చేసిన అధికారులు

గన్నేరువరం, జూలై 3: మండల కేంద్రం శివారులోని పలుగురాళ్ల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను బుధవారం రెవెన్యూశాఖ అధికారులు ఆర్ఐ రజనీకుమార్ తమ సిబ్బందితో కలిసి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక పది ట్రిప్పులకుపైగా ఉంటుందని తెలిపారు.